క్లుప్తంగా

సొండికుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమ్మేళనంలో సంఘ ప్రతినిధులు

కవిటి: స్థానిక ఎస్‌కేఈ రోడ్డులోని జగతి కొబ్బరితోటల్లో సొండికుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. నూతన కార్యవర్గాన్ని పొండవ రామారావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నతమైన ఫలితాలు సాధించిన బాలబాలికలను జ్ఞాపికలతో సత్కరించారు.

ఎన్‌ఆర్‌ఐల వితరణ


బియ్యం ప్యాకెట్లు అందజేస్తున్న దాతలు

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో అనాథలుగా ఉన్న వృద్ధులు, విద్యార్థులకు ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెంది.. రష్యాలో 'ఐఎల్‌సీ, ఇన్నాట్' కంపెనీలో ఉద్యోగం చేస్తున్న పిట్ట వాసు, చట్టి నరేష్ కుమార్, వారి బృందం వస్తు సామగ్రిని వితరణ చేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆశ్రమానికి ఆదివారం విచ్చేసి రూ. ఒక లక్ష విలువైన 50 బియ్యం ప్యాకెట్లు, 48 మంది నిరుపేద విద్యార్థులకు నూతన వస్త్రాలను అందించారు. అలాగే వజ్రపుకొత్తూరు మండలం పూండి గ్రామానికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు రూ. 35 వేలు విలువైన నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహన్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


పురుషోత్తమరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్‌గా కమిటీలో స్థానం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని ఆశి పురుషోత్తమ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్విజ్ విజేత బొరివంక

ఇచ్ఛాపురం రూరల్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండలం సన్యాసిపుట్టుగలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాల విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒడియా జెడ్పీ ఉన్నత పాఠశాలలు నిలిచాయి. విజేతలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డీన్ దూడ విష్ణుమూర్తి షీల్డు, నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, మాజీ సర్పంచ్ నీలాపు చంద్రయ్య, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు బాగ జయపతి, బాగ మోహనరావు, పెద్దరెడ్డి మాసుపత్రి వీరాస్వామిరెడ్డి, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రజలది ఉదార మనస్తత్వం


విజేతలతో యూవీవీ ప్రతినిధులు

పలాస: ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా 5కే రన్ పోటీలు జరిగాయి. పోటీలను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రజలది ఉదార మనస్తత్వమన్నారు. సమాజం, పరిసరాలను అభివృద్ధి చేయాలనే మంచి సంకల్పానికి కృషి చేస్తున్నారని అభినందించారు. గరుడబద్ర నుంచి నీలావతి గ్రామం వరకు 5కే రన్ సాగింది. మొండిరాయవలస గ్రామానికి చెందిన బి.మోక్ష ప్రథమ స్థానంలో నిలవగా.. అతనికి గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ రూ.5 వేలు నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. సంతోష్‌కుమార్ యాదవ్ (రాయపాడు) ద్వితీయ స్థానంలో నిలవగా అతనికి రూ.4 వేలు, కె.అభి(లోహరబంద)కు రూ.3 వేలు, బి.మహేష్‌కు (నందిగాం)కు రూ.2 వేలు, డి.ప్రేమ్(రంగోయి)కు రూ. 1000లు నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. యువీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు దుమ్ము శంకరరావు, ప్రధానకార్యదర్శి జి.లోకేశ్వరరావు, కల్నల్ మద్దు చంద్రశేఖర్, పి.గీతమ్మ, కుత్తుం ప్రకాశరావు, జినగ సీతారామయ్య, కుత్తుం వినోద్, పి.క్రిష్టారావు, ఎస్.మధు, బి.చిన్నారావు, కె.సుధాకర్, టి.వాసుదేవరావు, టి.ఖగేశ్వరరావు, వై.కామేశ్వరరావు, పి.బాలరాజు నీలావతి పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్!

- సంతబొమ్మాళిలో వెలసిన వైనం
- అనుమతులు లేకపోయినా అమ్మకాలు


పాలేశ్వరమ్మ గుడి సమీపంలో వేసిన అక్రమ లేఅవుట్

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి పాలేశ్వరమ్మ గుడి సమీపంలో అక్రమ లేఅవుట్ వెలసింది. కన్వర్షన్ చేయకుండా, పంచాయతీ అనుమతి లేకుండా లేఅవుట్‌లోని ప్లాట్లను లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, రియాల్టర్ల అలసత్వ కారణంగా కొనుగోలుదారులు పాట్లుపడుతున్నారు. సంతబొమ్మాళిలో సర్వే నంబర్ 236–6లో సుమారు ఎకరా విస్తీర్ణంలో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌ను వేశారు. అధికారాన్ని బూచిగా చూపెట్టి ఓ టీడీపీ నాయకుడు ఎటువంటి అనుమతులు లేకపోయినా లేఅవుట్‌లోని ప్లాట్లను విక్రయిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇందంతా తెలిసినా ఏమి చేయలేని పరిస్థితిలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఉన్నారు. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసే ముందు వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అధికారుల అనుమతి తీసుకోవాలి. ఆ తరువాత అధికారులు లేఅవుట్‌లోని భూములను పరిశీలించి అనుమతులు ఇస్తారు. అలాగే సామాజిక అవసరాల నిమిత్తం పది శాతం భూమిని పంచాయతీకి కేటాయించాల్సి ఉంది. కొలతల ప్రకారం డ్రైనేజీలు, రోడ్లు ఏర్పాటు చేయాలి. అయితే ఈ లేఅవుట్‌లో అవి మచ్చుకైన కనిపించడం లేదు. ఎటువంటి అనుమతుల్లేకుండా లేఅవుట్‌లో ప్లాట్ల అమ్మకాలపై కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేయలేదు

లేఅవుట్ ఏర్పాటు చేసే ముందు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. కన్వర్షన్ అయిన తరువాత లేఅవుట పనులు ప్రారంభించాలి. సంతబొమ్మాళిలో సర్వేనెంబర్ 236–6లో కన్వర్షన్ కోసం ఇంతవరకు దరఖాస్తు చేయలేదు.
– భాస్కరరావు, వీఆర్వో, సంతబొమ్మాళి

పంచాయతీ అనుమతుల్లేవు

సంతబొమ్మాళిలో వేసిన లేఅవుట్‌కు ఎటువంటి పంచాయతీ అనుమతుల్లేవు. ఇంతవరకు పంచాయతీ అధికారులను ఎవ్వరు సంప్రదించలేదు.
– డి. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, సంతబొమ్మాళి

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్


బహుమతులతో 5కే రన్ విజేతలు

సోంపేట: బారువ పూర్వవిద్యార్థి సంఘం ప్రతినిధులు క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. బారువ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న క్రీడా పోటీలను ఆదివారం తిలకించి, క్రీడాకారులను ఎంపీపీ అభినందించారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, పూర్వవిద్యార్థి సంఘ ప్రతినిధులు కర్రి సత్యం, ధర్మారావు, మాధవరావు, సింహాచలం, ఆనంద్ పాణిగ్రాహి ఉన్నారు.

5కే రన్ విజేత యోగేష్

పూర్వవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బారువ గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల సౌజన్యంతో నిర్వహించిన 5కే రన్ పోటీల్లో రామభద్రాపురం గ్రామానికి చెందిన యోగేష్ విజేతగా నిలవగా.. బారువకు చెందిన బి.ఆకాష్ ద్వితీయ, కవిటికి చెందిన కె.శివ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు వరుసగా రూ. 4 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

అయోధ్య రామమందిర ప్రథమ వార్షికోత్సవం


భజన చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

ఇచ్ఛాపురం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామ మందిరం పునర్ నిర్మాణం ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఈనేసుపేట, టి.బరంపురం, ధర్మపురం, మండపల్లిలోని దేవాలయాల్లో నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వీహెచ్‌పీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

- మంత్రి అచ్చెన్నాయుడు


నిమ్మాడలో ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పథకం నిధులతో టెక్కలి మండలం రావివలస, కోటబొమ్మాళి మండలం నిమ్మాడ, తిలారు గ్రామ పంచాయతీలకు మంజూరైన నాలుగు ట్రాక్టర్లను ఆదివారం మంత్రి పంపిణీ చేశారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, నాయకులు కె.హరివరప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, వి.విజయలక్ష్మి, టి.రామకృష్ణ, బోయిన రమేష్, మామిడి రాము పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

సీఎం సహాయ నిధి కింద టెక్కలి నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సుమారు 36,98,774 రూపాయల విలువైన చెక్కులను ఆదివారం బాధిత కుటుంబాలకు మంత్రి అచ్చెన్నాయుడు కోటబొమ్మాళిలో అందజేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ఎంత మొత్తంలోనైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

క్రీడలపై దృష్టిసారించాలి


విజేతలతో క్రీడా నిర్వాహకులు

కాశీబుగ్గ: క్రీడలపై దృష్టిసారించాలని వక్తలు అన్నారు. 41వ రాష్ట్ర జూనియర్ బాల బాలికల టెన్నికాయిట్ పోటీల ముగింపు కార్యక్రమం జాతీయ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పట్ట తవిటయ్య ఆధ్వర్యంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్ల సంతోష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తవితయ్య మాట్లాడుతూ ఇటువంటి పోటీల నిర్వహణకు పీసీఎంఏ ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు మాట్లాడుతూ.. 2003 నుంచి ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయుల చొరవతో పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. క్రీడా ప్రోత్సాహకులు మల్ల భద్రయ్య, కామేశ్వరరావు, కాంతారావు, నాయకులు బడ్డ నాగరాజు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు తారక్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు టి.గజేంద్రరావు, సీహెచ్ పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్వీ జోగారావు పాల్గొన్నారు. బాలికల విభాగంలో జి.సుప్రియ, ఎస్.మానస, ఆర్.సంస్కృతి, పి.లావణ్య, కె.జ్యోతికా, బి.గాయత్రి, బాలురు విభాగంలో బి.సిద్ధార్థ, ప్రవీణ్‌కుమార్, డి.ఉదయ్‌కిరణ్, జగదీష్‌బెహరా, జి.అస్లేస్ కుమార్ విజయం సాధించారు.

గ్రంథాలయంలో బీరువాలు ప్రారంభం


ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాసలోని శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, బీరువాలను ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం ప్రారంభించారు. దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు విద్యా సంకల్పం పేరుతో అతని కుమారుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద, ఎర్రన్నాయుడు, స్వాతంత్ర్య సమరయోధులు గౌతు లచ్చన్న చిత్రపటాలకు నివాళులర్పించారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, ఎంపీడీవో కె.వసంతకుమార్, ఈఓ వై.వైకుంఠరావు, నాయకులు దువ్వాడ శ్రీకాంత్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, గ్రంథాలయ అధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సరుకులు పంపిణీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేద తెలగ కుటుంబాలకు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సంఘ పెద్దలు రూప్‌సుందర్, వాసు, లోకు, ప్రతాప్, మన్మథరావు, భాస్కరరావులు మాట్లాడుతూ.. ఏటా సంక్రాంతికి ముందు తమ సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబాలకు సరుకులు అందజేస్తామని చెప్పారు. సంఘ సభ్యులు ప్రసాద్, గోవింద్, మూర్తి, చిరంజీవి, కామేష్, బాబ్జి, ప్రకాష్ పాల్గొన్నారు.

వివేకానందునికి ఘనంగా నివాళి

స్వామి వివేకానంద సూక్తులు, బోధనలు నేటి యువతకు ఆదర్శమని వక్తలు అన్నారు. వివేకానంద 162వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానందుడు చూపిన మార్గంలో యువత పయనించి నవసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.
– సాక్షి నెట్‌వర్క్


ఇచ్ఛాపురం రూరల్: డొంకూరులో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేస్తున్న యువకులు


సోంపేట: జింకిభద్రలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు


సంతబొమ్మాళి: వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేస్తున్న శాఖాగ్రంథాలయ అధికారి రామకృష్ణ


కవిటి: బల్ల ఎర్రగోవిందపుట్టుగలో చిన్నారుల చైతన్య ర్యాలీ


ఇచ్ఛాపురం: బస్టాండ్‌కూడలిలోని వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న హిందూధార్మిక సేవాసమితి అధ్యక్షులు బాలబ్రహ్మానందసరస్వతి


ఇచ్ఛాపురం: వివేకానదుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు


కవిటి: బొరివంకలో ఉద్దానం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో వివేకానందకు నివాళులర్పిస్తున్న దృశ్యం

హెల్మెట్ వినియోగంపై అవగాహన



ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ బి.మంగరాజు అన్నారు. సోంపేట, బారువ గ్రామాల్లో రహదారి భద్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. బారువలో ర్యాలీ, మానవహారాలు చేపట్టారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఎస్‌ఐలు లవరాజు, హరిబాబు నాయుడు, గైస్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. – సోంపేట

పోలీసులకు సమాచారం ఇవ్వండి



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ జంట పట్టణాలకు చెందిన వారు సంక్రాంతి నేపథ్యంలో క్యాంపులు, స్వగ్రామాలకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ సూచించారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో ఆటోతో ఆదివారం ప్రచారం చేయించారు. దొంగతనాలకు ఆస్కారం ఉందని, విలువైన వస్తువులు ఇళ్లలో ఉంచవద్దని కోరారు. క్యాంపులకు వెళ్లేవాళ్లు ముందస్తు సమాచారం ఇస్తే ఇళ్లకు పోలీసు రక్షణ కల్పిస్తామన్నారు. – కాశీబుగ్గ

యువకులు రక్తదానం



తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రాణదానం చేయాలనే సమున్నత లక్ష్యంతో బొరివంక యువత రక్తదానం చేసేందుకు ముందుకురావడం అభినందనీయమని సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, సోంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ రాజేంద్రప్రసాద్,డాక్టర్ తుంగాన వేంకటేశం అన్నారు. బొరివంకలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా 35 మంది యువకులు రక్తదానం చేశారు. సోంపేటకు చెందిన ఉద్దానం బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తసేకరణ చేశారు. గ్రామపెద్దలు బెందాళం విజయకృష్ణ, బల్లెడ లక్ష్మణమూర్తి, ఎంఈవో ధనంజయమజ్జి పాల్గొన్నారు. – కవిటి

అపూర్వ కలయిక..


టెక్కలి: ఒకే వేదికపై జర్జంగి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


కంచిలి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


వజ్రపుకొత్తూరు రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో అక్కుపల్లి పూర్వ విద్యార్థులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం జర్జంగి జెడ్పీ ఉన్నత పాఠశాల 1998–99 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సీపాన అన్నయ్య ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. నరసన్నపేట ఎంఈవో పి.దాలినాయుడు, ఉపాధ్యాయులు పోలినాయుడు, ఆర్.సూర్యనారాయణ, డి.సోమేశ్వరరావు, కె.అప్పలనాయుడు, ఎస్.త్రినాథులు, ఎల్.కరుణాకర్ పాల్గొన్నారు.

- కంచిలి: మండల కేంద్రం కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో సెటిల్ అయిన వారంతా 15 ఏళ్ల తరువాత ఒకచోట కలిసి పాతజ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా సరదాగా గడిపారు.
- వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు అక్కుపల్లి శివసాగర్ తీరంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ అలనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి అభినందించారు.

వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


విగ్రహావిష్కరణలో రామారావు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: స్వామి వివేకానందుని జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి మెట్ట రామారావు అన్నారు. వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గోవిందపురంలోని వివేకానంద విద్యా సంస్థ ఆవరణలో పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన వివేకానంద నిలువెత్తు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ పేరాడ సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెట్ట మోహనరావు, ఎం.రవికుమార్, ప్రిన్సిపాల్ దండు వనజనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: కొత్తంపురం గ్రామానికి చెందిన పిలక రామయ్య, బెల్లుపడకు చెందిన చిదపరెడ్డి శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల చనిపోయారు. వీరి కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, సర్పంచ్ అయిధం జయరాం, లడ్డు కేశవపాత్రో, మద్ది అప్పారావు, ఆదినారాయణ, మోహనరావు, కొరికాన వెంకటరావు ఉన్నారు.

కె.కొత్తూరులో పారిశుద్ధ్య పనులు

టెక్కలి: సంక్రాంతి నేపథ్యంలో కె.కొత్తూరు గ్రామంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కాలువలను శుభ్రం చేశారు. సర్పంచ్ మొర్రి శంకర్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వీధుల్లో బ్లీచింగ్ జల్లించారు.